




గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 1100 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# శతాబ్దాల తెలుగు పత్రికలు తీరుతెన్నులు

## –6–

తరువాత మనం విశేషాలు తెలుకోబోయే పత్రిక "ప్రజామిత్ర". ఈ పత్రిక కూడా ఒక రాజకీయ అనుబంధంగా మొదలయ్యింది. ఎలాగంటే – జస్టిస్ పార్టీలోని ముఠా తగాదాల వల్ల, చల్లపల్లి రాజా గారు బయటకు వచ్చి, "ప్రజా మిత్ర"అనే రాజకీయ పార్టీని పెట్టారు. గతంలో జస్టిస్ పార్టీకి అనుబంధంగా "సమదర్శని "ఉండేది కదా! ఆ అనుభవంతో ఆయన తన పార్టీ ఆశయాలు ప్రచారం చేయడానికి "ప్రజామిత్ర"అనే పత్రికను ప్రారంభిద్దామని అనుకున్నారు. అందరి సలహాలను తీసుకుని, ప్రజామిత్ర పత్రికను బెజవాడలో ప్రారంభించారు.

మొదట్లో దానికి అవుటుపల్లి సూర్యనారాయణ గారు సంపాదకత్వం వహించేవారు. కొంతకాలం తర్వాత బెజవాడ నుండి మద్రాస్ కు మార్చారు. అప్పుడు ఆయనకు బాగా పరిచయం వున్న గూడవల్లి రామబ్రహం గారిని సంపాదకుడిగా తీసుకున్నారు. రామబ్రహ్మం గారి సంపాదకత్వంలో ఈ పత్రిక మద్రాస్ నుండి రావడం ప్రారంభం అయ్యాక దాని రూపు రేఖలు పూర్తిగా మారిపోయాయి. అప్పటికి, అంటే, ఈ ప్రజామిత్ర ప్రారంభం అయ్యే నాటికి

మద్రాస్ వదలి వెళ్లిన తాపీ ధర్మారావు గారు వెనక్కి వచ్చారు. తన దగ్గర శిష్యరికం చేసిన గూడవల్లి రామబ్రహ్మం గారు సంపాదకత్వం వహిస్తున్న పత్రికలో తాపీ ధర్మారావు గారు చక్కటి వ్యాసాలూ, సాహిత్య పరమైన అంశాలు కూడా రాశారు.

తాపీ ధర్మారావు గారు రాసిన కొత్త పాళీ, దేవాలయాలపై బూతు బొమ్మలెందుకు?... ఇలాంటి వ్యాసాలన్నీ కూడా 1936వ సంవత్సరంలో ప్రచురించారు గూడవల్లి. అయితే, ఆ వ్యాసాల్లో రచయిత పేరు చిట్టచివరి వరకు చెప్పకుండా, విమర్శలను ఆహ్వానించి, వాటిని ప్రచురిస్తూ చివరలో రచయిత పేరు వెల్లడిచేశారు. అలా విమర్శనా రంగంలో కూడా ఒక కొత్త ఒరవడిని సృష్టించింది ప్రజామిత్ర. వీటిల్లో సినిమా వార్తలక్కూడా చాలా ప్రాముఖ్యతను ఇచ్చి, సినీ జర్నలిజం కి ఒక కొత్త బాటలు వేసాయి. అలాగే, పత్రికా వాటితో పాటుగా వచ్చే అంశాలతోబాటు పాటు గూడవల్లి, తాపీ ధర్మారావుగార్లు కవులూ, పండితులను దగ్గరకు చేర్చుకుంటుండేవారు.

ప్రజామిత్ర పత్రిక కార్యాలయం ఒక రాజుగారి కొలువు కూటమి లాగా ఉండేదట. ఎంత మందో రాజకీయ నాయకులూ, రచయితలూ, అనేక మంది ప్రముఖులు వస్తూ వెళుతూ ఉండేవారు. ఎప్పుడూ సాహిత్య గోష్టులూ, చర్చలూ ఇలాంటివన్నీ జరుగుతూ ఉండేవి. అక్కడకి ఒక కుర్రవాడు వస్తుండేవాడు. చార్టెడ్ ఎకౌంటెంట్. ఆయనకు సాహిత్యంతో పరిచయం లేకపోయినప్పటికీ, అక్కడకు వస్తున్నా తాపీ ధర్మారావు గారూ, సముద్రాల రాఘవాచార్య గారూ, గోపిచందు గారూ, నార్ల వెంకటేశ్వరావు గారూ కొసరాజు రాఘవయ్య గారూ వీళ్లందరినీ చూసి ఆయన కూడా సాహిత్యం పట్లా, కళల పట్లా ఆసక్తి పెంచుకొని తరవాత రోజుల్లో ప్రముఖ దర్శకుడు అయ్యారు. ఆయనే బి. ఎన్. రెడ్డి గారు.

ప్రజామిత్ర నడుస్తున్న క్రమంలో బి.యెన్. రెడ్డి గారు, తరచూ పత్రిక ఆఫీసుకి రావడంతో గూడవల్లి రామబ్రహ్మం గారితో పరిచయం ఏర్పడింది. ప్రజామిత్ర ప్రింటింగ్ లో కొన్ని ఇబ్బందులు వచ్చినపుడు బి. ఎన్. రెడ్డి గారిని అడిగి, ఆయనతో ఒక ప్రింటింగ్ ప్రెస్ ను ఏర్పాటుచేశారు. ప్రారంభింప చేయడమే కాకుండా ప్రజా మిత్ర ఆఫీసుని కూడా, ఆ రెడ్డి గారు ప్రారంభించిన బిల్డింగు లోనే పై అంతస్తులోకి మార్చారు. అక్కడ నుండి వాళ్ళిద్దరికీ పరిచయాలు బాగా పెరగడం, ఆ తరువాత వాళ్లిద్దరూ సినిమాల్లోకి వెళ్లడం అదంతా వేరే కథ.

గూడవల్లి పరిశోధనాత్మక మైన వార్తలనీ, చాలా ధైర్యంగా ప్రచురిస్తుండేవారు. అప్పట్లో ప్రజామిత్ర పత్రిక ప్రతి శుక్రవారం విడుదలయ్యేది. ఇది మద్రాస్ నుండి వచ్చేది కదా! ఆంధ్ర దేశంలో బుధవారం నుండే "ప్రజామిత్ర "పత్రిక ఎప్పుడు వస్తుంది?ఈ వారం ఏ సంచలనాత్మకమైన వార్తలు వేస్తారు?అని ఎదురు చూస్తూండేవాళ్ళట అందరూ. కొన్ని ఉదాహరణలు---

ప్రజామిత్రలో గూడవల్లి గారు రాసిన సాహసోపేతమైనటు వంటి కొన్ని వార్తలు..

అప్పట్లో కొందరు కాంగ్రెస్ నాయకులు తప్పుడు మార్గంలో నడిచారు – అని ఒక వార్త అందింది. ఆ వ్యవహారానికి సంబంధించిన కొన్ని ఆధారాలు, పత్రాలు కూడా దొరికాయి. గూడవల్లి రామబ్రహ్మం గారు పత్రికలో పనిచేసేవాళ్లకు "మీరేమి భయపడకండి. మనకు దొరికిన ఆ ఉత్తరాలన్నీ బ్లాకులు తీసి, యధాతధంగా అచ్చు కొట్టండి"అని చెప్పారట. ఆ వ్యవహారం ప్రజామిత్రలో రాగానే రాజకీయ రంగంలో తీవ్రమైన సంచలనం కలిగించింది. రాజకీనాయకుల గుండెల్లో కూడా రైళ్లు పరిగెత్తాయి. ఆ రోజుల్లో ఇలా వాస్తవాలు ప్రటించినందుకు, కేసులు పెట్టడం, పోలీసులతో అరెస్టు చేయించడం ఇలాంటివి ఉండేవి కాదు. నిజంగా వార్త వస్తే'మాలో ఏం తప్పు వుందో 'నని సరి చేసుకోవడానికి ప్రయత్నిస్తుండేవారట.

మరో ఉదాహరణ...

ఆసుపత్రిలో వైద్యం, వైద్యులు సామాన్యులకు అందుబాటులో లేకపోవడం, ఇలాంటివాటిని వ్యతిరేకిస్తూ ఒక వ్యాసం రాశారు. "ధన వంతులకే ధర్మాసుపత్రులు "అని. ఆ రోజుల్లో ఇలాంటి వార్తలు వస్తే "మాలో తప్పు ఉంటే, సరి చేసుకుంటాము"అనుకునే వాళ్ళే ఎక్కువ. అందుకని తమ ఆసుపత్రిలో జరిగే అక్రమాలకు క్షమాపణ చెబుతూ పత్రికలకు ఉత్తరాలు రాశారట. కొంత మంది. "ఇలాంటివి మేము ఆపేస్తాము. ఇక పై వైద్యం అందరికి అందుబాటులో ఉండేలాగా చూస్తాము"అని.

గూడవల్లి ధైర్యంగా ప్రకటించిన ఇంకొక వార్త...

ఆ రోజుల్లో ఒక బాబా గారి భక్తి ఉద్యమం ఆంధ్రదేశం అంతటా వెర్రితలలు వేస్తోందట. భార్యాభర్తలు ఇద్దరూ కూడా మహిమలు వున్నాయి అని కథలు.. కథలు.. గా ప్రచారం చేసుకుంటుండేవారు. తెలుగు వాళ్ళ ఇళ్లళ్లలో వాళ్ళ భజనలు జరుగుతూ ఉండేవి. "ఇలాంటి కుహనా దేవుళ్ళ భక్తి ప్రవాహంలో తెలుగు ప్రజలు కొట్టుకు పోకూడదు" అని ప్రజామిత్రలో ఆ బాబా భక్తి ఉద్యమం గురించి ఘాటైన విమర్శ రాశారు.

ఆ వ్యాసాన్ని చదివి బాబా భక్తులంతా గంగవెర్రు లెత్తిపోవడమే కాకుండా, "మాకు మీ పేపరు వద్దు"అని ప్రజామిత్రకు ఉత్తరాలు రాశారు. అయినా గానీ, పట్టించుకోకుండా తాను నిజం అని నమ్మింది తన దగ్గర రుజువులు ఉంటే, అంత ధైర్యంగా ప్రకటిస్తూ ఉండేవారు గూడవల్లి రామబ్రహ్మంగారు. అలాగే ఆ రోజుల్లో స్థానం నరసింహారావు గారు ప్రముఖ నటులు. అయన మీద కూడా ప్రజామిత్రలో "స్థానం వారి కుంభకోణం" అని హెడ్డింగ్ పెట్టి వ్రాసారు. అది మార్కెట్ లోకి రాగానే, జనం విరగబడి కొన్నారు. ఇలా గూడవల్లి రామ బ్రహ్మం గారు ఎన్నో సాహసాలు చేశారు ఈ ప్రజామిత్ర పత్రిక ద్వారా.

ఈ ప్రజామిత్ర పత్రిక ఆఫీసుకుకు చాలా మంది వస్తుండేవారు అని తెలుసుకున్నాం కదా!

దాంట్లో కొన్ని ముఖ్యమైన సంఘటనల గురించి చెప్పుకోవాలంటే, గిడుగు రామ్మూర్తి పంతులుగారు ఆరోగ్యం సరిగ్గా లేక వైద్యం చేయించుకోవడానికని, 1940 సంవత్సరం జనవరి నెలలో మద్రాస్ వచ్చారు. బహుశా ఆయన చిట్టచివరి సారిగా చేసిన ఉపన్యాసం ప్రజామిత్ర కార్యాలయం లోనే జరిగింది. ఆ తరువాత కొద్దీ రోజులకే జనవరి 19 వ తారీఖున గిడుగు రామ్మూర్తి పంతులు గారు మరణించారు. గూడవల్లి రామబ్రహ్మం గారు, గిడుగు రామ్మూర్తి పంతులు గారికి అసాధారణమైన రీతిలో శ్రద్ధాంజలి ఘటించారు.

గిడుగు వారి అంతిమ యాత్ర సందర్భంగా రాయపేట స్మశానం దాకా, దారి పొడవునా ప్రజామిత్ర పత్రిక వారు పోస్టర్స్ వేశారు. శవదహనానికి ముందు ప్రముఖులు, గిడుగు వారి మరణానికి సంతాపాన్ని ప్రకటించారు. ప్రజామిత్ర పత్రిక తరపున గూడవల్లి గారు అక్కడ ఏర్పాట్లు చేశారు. అదే సందర్భంగా గిడుగు వారి స్మారక సంచిక రూపంలో ప్రజామిత్ర ప్రత్యేక అనుబంధాన్ని కూడా ప్రచురించారు. గిడుగు వారి ఆశయాలకు అనుగుణంగా రామబ్రహ్మం గారు, తన రచనా శైలిని పూర్తిగా వాడుక భాషనే ఉపయోగిస్తూ ఉండేవారు. అలాగే కాశీనాథుని నాగేశ్వరావు పంతులు గారు చనిపోయినప్పుడు కూడా వాళ్ళ పత్రిక “భారతి”ఉన్నప్పటికీ, కాశీనాథుని నాగేశ్వరావు పంతులుగారికి నివాళులు అర్పిస్తూ, ప్రజామిత్ర ఒక ప్రత్యేక సంచికను ప్రచురించారు.

అలాగే రాడికల్ హ్యూమానిస్ట్ అయినటు వంటి M. N. రాయ్ గారు మద్రాస్ వచ్చినపుడు ఆ సందర్భంగా ప్రజామిత్ర కార్యాలయంలో రామబ్రహ్మంగారు స్వాగతం, సభ ఏర్పాటుచేశారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖుల్ని, పత్రిక విలేఖరులను కూడా ఆహ్వానించారు. ఇలా ప్రజామిత్ర పత్రిక గూడవల్లి రామ బ్రహ్మం గారి సారధ్యంలో కొత్త పుంతలు తొక్కడమే కాకుండా, సమాజంలో జరిగే ఎన్నో, అన్యాయాల్నీ, అక్రమాలనీ బయటపెడుతుండేది. ప్రజామిత్ర పత్రిక కొనసాగుతూ ఉండగానే గూడవల్లి రామబ్రహ్మం గారు సినిమాల్లోకి వెళ్లడం, మాలపిల్లా, రైతు బిడ్డా సినిమాలు నిర్మించడం,అవి ఘన విజయం సాధించడం జరిగింది.

ఇన్ని జరుగుతుండగా కూడా ప్రజామిత్ర పత్రికను బ్రతికించడం కోసమని గూడవల్లి రామబ్రహ్మంగారు ఆంధ్ర దేశంలోని అన్ని వూర్లకూ వెళ్లి చందాలు కట్టిస్తుండేవారట. దాదాపు 10 సంవత్సరాలు కొనసాగింది. 1941, 42 వరకు. అప్పటికి అటు గూడవల్లీ, ఇటు తాపీ ధర్మారావుగారూ ఇద్దరూ సినిమాల్లో బిజీ అవ్వడంతో ఈ “ప్రజామిత్ర పత్రిక నెమ్మది నెమ్మదిగా ఆగిపోయింది. ఇప్పటికి కూడా వెనక్కి తిరిగి చూసుకుంటే ఆ రోజుల్లో, సమ దర్శిని, ప్రజా మిత్రా పత్రికల యొక్క ప్రశస్తిని గానీ, వాటి యొక్క ప్రాధాన్యతను గానీ, తెలుగు పత్రికల చరిత్రలో ప్రత్యేకంగా ప్రస్తావించుకోవలసి వస్తుంది.

తరువాత మనం విశేషాలు తెలుసుకోబోయే పత్రిక పేరు “జనవాణి”. విచిత్రంగా ఇది కూడా మరొక రాజకీయ పార్టీకి చెందినదే. అయితే దీనికి కూడా సంపాదకుడు తాపీ ధర్మారావు గారే. తెలుగు పత్రికల ప్రస్తావన వచ్చినపుడు,

జనవాణి పత్రిక గురించి తప్పక మాట్లాడుకోవాలి. గతంలో జస్టిస్ పార్టీ నుండి చీలి ప్రజామిత్ర పార్టీ వచ్చిందని తెలుసుకున్నాం కదా! అలాగే మొదలైన ఇంకో శాఖ "పీపుల్స్ పార్టీ." దీనికి ముఖ్య నాయకుడు ఆనాటి పిఠాపురం రాజా గారు. ఆ పీపుల్స్ పార్టీకి అనుబంధమే "జనవాణి"పత్రిక 1936 నుండి 1939 వరకూ వచ్చింది.

ఈ పత్రికలో తాపీ ధర్మారావుగారి దగ్గర తరవాత రోజుల్లో ప్రముఖ పత్రికా సంపాదకులుగా పేరు తెచ్చుకున్న నార్ల వెంకటేశ్వరావుగారూ, పండితారాధ్యుల నాగేశ్వరావు గారూ ఇలాంటి వాళ్ళందరూ ఉపసంపాదకులుగా పనిచేశారు. పీపుల్స్ పార్టీకి జనవాణి తెలుగు పత్రికతో పాటుగా "పీపుల్స్ వాయిస్"అనే ఆంగ్ల పత్రిక, జన నాయగమ్" అనే తమిళ పత్రిక కూడా ఉండేవి. అప్పట్లో జస్టిస్ పార్టీకీ, కాంగ్రెస్ పార్టీకీ, మధ్యన ఎన్నికల వాతావరణం వుంది. అందుకని రాజకీయాల ప్రసక్తి ఎక్కువగా ఉండేది ఈ జనవాణి పత్రికలో. వాటితో పాటుగా మిగతా పత్రికల్లగానే సాంఘిక, సారస్వత విషయాలు కూడా ఈ పత్రికలో ఉండేవి. సంపాదకుడిగా తాపీ ధర్మారావు గారికి నెలకి 250 రూపాయలు జీతం ఇచ్చేవారట. ఉప సంపాదకుడిగా నార్ల వెంకటేశ్వరావుగారికి 60 రూపాయలు ఇచ్చేవారు. తాపీ ధర్మారావుగారిది విలక్షణమైన వ్యవహార శైలి. ఆయన ఒకరికి లొంగేవాళ్ళు కాదు. ఒకరి మీద పెత్తనం చెలాయించేవారు కాదు. సంపాదకీయాలు ఎప్పుడూ ఆయనే వ్రాస్తూండేవారు.

"అయన వ్రాసింది చూసి నేర్చుకున్నాను" అని నార్ల వెంకటేశ్వరావు గారు ఆ తరవాత చాలా చోట్ల చెప్పుకున్నారు. ఇంకా నార్ల వెంకటేశ్వరావు గారు "తాపీ ధర్మారావుగారు మాకు చాలా స్వేచ్ఛ ఇచ్చేవారు. నా సహ సంపాదకుడైన పండితారాధ్యుల నాగేశ్వరావు నేనూ, పోటీ పడుతుండేవాళ్ళం."అని ఒక ఇంటర్వ్యూ లో చెప్పుకున్నారు. పత్రిక స్టాండర్డ్ గానీ, రూపం గానీ కొత్తదనం తీసుకురావడానికని తాపీ ధర్మారావు గారు ఒక విచిత్రమైన ఆలోచన చేశారు. అదేమిటంటే, ఇతర దేశాల పత్రికలను చూసి, తన పత్రికలో పనిచేసే వాళ్ళందరికి కూడా "ఆ పత్రికను చూసి, మన పత్రికను కూడా అలా ఎలా తీసుకురాగలము" అని ఆలోచించండి అని ఒక కొత్త బాధ్యతను అప్పగించారు.

మరి ఇతర దేశాల పత్రికలు ఎక్కడ దొరుకుతాయి? ఆ రోజుల్లో విదేశాలనుండి భారతదేశానికి వచ్చే పడవలు, సముద్రంలో అటూ, ఇటూ వూగకుండా వుండడానికని అడుగున ఆ పత్రికలను డెడ్ వెయిట్ గా వేసేవాళ్ళట. నార్ల వెంకటేశ్వరావుగారూ ఇంకా మిగతా బృందం ఆ పత్రికలన్నీ కొని వాటిని అధ్యయనం చేసి, జనవాణికి కొత్త రూపురేఖలు ఎలా తీసుకురావాలా అని ఆలోచిస్తూ ఉండేవారు. అప్పటి వరకూ దినపత్రికల్లో వ్యవహారిక భాష ఎక్కువగా ఉండేది కాదు. కాస్త గ్రాంథికంగా ఉండేది. అలాంటిది తాపీ ధర్మారావు గారు మొట్టమొదటిసారిగా వ్యవహారిక భాషను, దిన పత్రికలోనూ, సంపాదకీయంలోనూ ప్రవేశ పెట్టారు. ఆ విధంగా కూడా జనవాణి పత్రికకు పత్రికా ప్రపంచంలో ఒక ప్రత్యేకత వుంది.

ఆయన ఈ వ్యవహారిక భాషను ఎలా వ్రాసేవారంటే, (ఆయనే రాసుకున్నారు ఒక చోట) "తక్కువ పదాలతో వాక్యాలు రాసేవాణ్ణి. సుమారుగా మూడే పదాలు ఉంటాయి వాక్యంలో. అంటే ఉదాహరణకి "రాజాజీ మద్రాస్ వచ్చారు. రాజాజీ ప్రసంగించారు. "ఇలా ఉండేవి. చాలా మంది ఏం అనేవారంటే, క్రియా పదాల్ని వ్యవహారికం చేస్తే, భాష వ్యవహారికం అయిపోతుంది. అనుకునేవాళ్లు. అంటే, 'వచ్చినాడు' అనేదాన్ని 'వచ్చాడు' అని రాస్తే సరిపోతుంది అనుకునేవాళ్లు. అలా కాకుండా చిన్నచిన్న పదాలతో వాక్యాలను రాస్తే అది నిజమైన వ్యవహారికం అవుతుంది. ఆ టెక్నిక్ నేను కనిపెట్టాను. ఆ రోజుల్లో ప్రారంభమైన "ఆంధ్ర ప్రభ "దిన పత్రిక వాళ్ళు కూడా నన్ను చూసి, చాలా ప్రశంసిస్తూ వుండేవాళ్ళు." అని తరవాత వ్యాసాల్లో రాసుకున్నారు.

ఆయన శిష్యుడు గూడవల్లి రామబ్రహ్మం గారు ఒక వైపున ప్రజామిత్ర పత్రికను ఎంత ధైర్యం తో నడుపుతున్నారో, అంత సాహసాలు తాపీ ధర్మారావు గారు కూడా చేశారు.

ఉదాహరణకు 1937 ప్రాంతాల్లో రాజమండ్రిలో మునిసిపల్ చైర్మెన్ గా "క్రొవ్విడి లింగరాజు"అనే ఆయన ఉండేవారు. ఈ క్రొవ్విడి లింగరాజు గారే "అమ్మ"నవలను తెలుగులోకి అనువాదం చేశారు. రాజమండ్రిలోనే కూరగాయల బజారు కాంట్రాక్టు సందర్భంలో కాంట్రాక్టర్ ఒకతను ఉండేవాడు. అతని పేరు"రెడ్డి అచ్చయ్య". ఆయనకు, ఈ మునిసిపల్ ఛైర్మెన్ లింగరాజు గారికి తగాదా వచ్చింది. ఆ అచ్చయ్య అనే ఆయన, ఈ లింగరాజు గారు చేసే పనుల మీద ఒక ఫ్లయర్ (కర పత్రం)లాంటిది వేశారు. అక్కడ విలేకరిగా ఉన్న పందిరి మల్లికార్జునరావు అనే ఆయన ఆ కరపత్రాన్ని "జనవాణి" పత్రికకు పంపించారు.

ఆ కరపత్రాన్ని జనవాణి పత్రికలో యధాతధంగా పబ్లిష్ చేసారు తాపీ ధర్మారావుగారు. దానికి గానూ ఆ క్రొవ్విడి లింగరాజు గారు ఆ కాంట్రాక్ట్ మీదా, తాపీ ధర్మారావు గారి మీదా, పబ్లిషర్ మీదా మొత్తం అందరి మీదా పరువు నష్టం దావా వేశాడు. అలాంటి వాటిని కూడా ధైర్యంగా ఎదుర్కొని వారు. అంతేగానీ, "ఈ వార్త వేస్తే ఏమవుతుందో? ఎవరైనా వస్తారేమోన"ని ఏమాత్రం భయపడే వారు కాదు. జనవాణి ఇలా 3 సంవత్సరాలు నడిచాక, 1937 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచింది. అంటే, జస్టిస్ పార్టీ, దాని అనుబంధ పార్టీలన్నీ కూడా ఓడిపోయాయి. దాంతోటి జనవాణిని పళ్ళ బిగువున రెండు సంవత్సరాలు నడిపించినా గానీ, రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమయ్యాక పత్రికలకు కాగితం కోటా బాగా తగ్గించేశారన్న నెపంతో, "పిఠాపురం రాజా వారు జనవాణి పత్రికను 1939 లో ఆపేసారు.

జనవాణికి మరికొంత కొనసాగింపు చరిత్ర కూడా వుంది. అదేమిటంటే 1939 లో ఆగిపోయాక, తాపీ ధర్మారావు గారే మరొక 10 సంవత్సరాల తర్వాత 1949 లో "జనవాణి"అనే పేరుతోనే పత్రికను తీసుకువచ్చారు. దాన్ని జనవాణి వెర్షన్-2 అనుకోవచ్చు. దాని విశేషాలు తర్వాత మాట్లాడుకుందాం. ఎందుకంటే, ఈ మధ్యలో తాపీ

ధర్మారావు గారు మరొక సాహసోపేతమైన పత్రికను తీసుకువచ్చారు. దాని పేరు "కాగడా". "కాగడా" అనగానే 1960, 70 ఆ ప్రాంతాల్లో ఒక సినిమా పత్రిక ఉండేది. కాగడా శర్మ అనే ఆయన సంపాదకత్వంలో వచ్చేది. దానికీ, ఇప్పుడు మనం ప్రస్తావించుకుంటున్న "కాగడా"కీ ఎటువంటి సంబంధం లేదు.

నిజంగా "కాగడా"అంటే "చిమ్మ చీకట్లో దారి చూపించే వెలుగు" అని అర్థం. ఆ పేరు తాపీ ధర్మారావు గారు పత్రికకు 100 కి 100 పాళ్ళూ సరిపోతుంది. తాపీ ధర్మరావు గారు 1938, 39 ప్రాంతాల్లో సినిమాల్లోకి రచయితగా వెళ్లారు. ఆయన దగ్గర శిష్యుడుగా పనిచేసిన గూడవల్లి రామబ్రహ్మం గారు దర్శకత్వం వహించిన సినిమాలకు మాటలు రాస్తూండేవారు. అలాంటి రోజుల్లో ఆయన 1940 జనవరి 10 వ తేదీన ఈ "కాగడా"వార పత్రికను ప్రారంభించారు. ప్రతి బుధవారం వస్తూ ఉండేది. సంపాదకులు తాపీ ధర్మారావు గారే.

"కాగడా" పత్రికకు మేనేజర్ గా వాళ్ళ అబ్బాయి తాపీ మోహన్ రావు గారు ఉండేవారు. బి. ఎన్, రెడ్డి గారి ప్రెస్ లోనే దీన్ని అచ్చు వేయిస్తుండే వారు. ఒక అణాకి 16 పేజీల పత్రికని అమ్ముతుండేవారు. ఒక రకంగా దీనికి తాపీ ధర్మారావు గారి కుటుంబ పత్రిక అంటుండేవారు. ఎందుకంటే, ధర్మారావు గారు ఎడిటరూ, వాళ్ళ అబ్బాయి మేనేజరూ, శెట్టి ఈశ్వరావు అని మరొక మిత్రుడు ఆయన కూడా మేనేజర్ గా వుంటుండేవాడు. కాగడా పత్రికను ప్రారంభించినపుడు ఆయన చాలా స్పష్టంగా వున్నారు. అంటే, ఆ పత్రిక ఆశయాలు ఏమిటి? పత్రికను ఎలా నడపాలి?ఎలాంటి వార్తలు దాంట్లో ఉండాలి? దేన్నీ బలపరచాలి? అనే విషయంలో ఆయన ఎంత స్పష్టంగా వున్నారో మొట్ట మొదటి సంపాదకీయాలు తెలియజేస్తాయి.

ఏం చెప్పారంటే...1. మూఢ సాంప్రదాయాల యదార్ధ స్వరూపాన్ని బయట పెట్టడంలో పెద్దలకే పాఠాలు చెప్పాలి.

2. కాగడా పత్రిక ప్రపంచ సారస్వతానికీ, మన సారస్వతానికీ సాధ్యమైనంత వరకూ భాయీ, భాయీ సంబంధం కలిగించాలి.

3.సాంఘికం అంటే, సంఘం లోని వివిధ అంశాలనూ అందులోని లోపాలనూ సహేతుకంగా విశదీకరించి, పత్రికా యుగంలో ఒక కొత్త ప్రపంచాన్ని స్థాపించాలని అనుకోవడం.

4. పత్రికలు ఒట్టి మాటల పోగులే కాకుండా ఉద్యమాలు నిర్వహించడంలో కూడా ప్రముఖ పాత్ర వహించాలి. ఈ కాగడా కూడా అలాంటి ప్రముఖ పాత్ర వహిస్తుంది అని చెప్పారు.

దీనికి ఒక ఉదాహరణగా ఆ రోజుల్లో ఆయన ఏం అన్నారంటే...

"రాజకీయంగా దేశంలో ముఖ్యంగా ఐకమత్యం కావాలి. ఐకమత్యం కరువు అవ్వబట్టే బ్రిటీష్ వాళ్ళు మనల్ని పాలిస్తూ వున్నారు. ఐకమత్యంగా ఉండాలంటే, కుల మత బేధాలన్నీ సమసి పోవాలి. ఆ బేధాలు సమసి పోవాలంటే,

వర్ణాంతర వివాహాలను ప్రోత్సహించాలి. అందుకు యువత ముందుకు రావాలి. వయసు మళ్ళిన వాళ్ళ వల్ల ఇది అయ్యే పని కాదు. యువకులారా! మీరు ముందుకు వచ్చి, వర్ణాంతర వివాహాలను ప్రోత్సహిస్తే గనక మనలో ఐకమత్యం పెరుగుతుంది. "అని ఒక విధమైన ఉద్యమాన్ని ప్రోత్సహించేటట్లుగా చేశారు. తన పత్రిక ద్వారా.

అలాగే దాంట్లో శీర్షికలు ఎక్కువగా ఉండేవి. 10,15 శీర్షికలను ఎంపిక చేసుకొని, ప్రతి వారం కనీసం 7,8 కి తగ్గకుండా ఉండేలాగా చూసేవారు. ఆ శీర్షికలు కూడా వివిధ విభాగాల్లో ఉండేవి. రాజకీయ, సాహిత్య, సాంఘిక శీర్షికలు. అలాగే సినిమా శీర్షికలు... ఇలా ఉండేవి. ఉదారణకు "గాలి విసురు" అని ఒక శీర్షిక ఉండేది. అందులో ఆయన సమకాలీన రాజకీయాల మీద విసుర్లు వేస్తూ ఉండేవారు. అది వ్రాయడానికని "తడాఖా "అనే కలం పేరు పెట్టుకున్నారు. తాపీ ధర్మారావు గారు మొదలుపెట్టిన కొత్త శైలి ఏమిటంటే, ఎవరి గురించి అయినా రాసేటప్పుడు ఉదాహరణకు రాజాజీ గారి గురించి రాస్తున్నారనుకొండి. రాజాజీ గారు ఇలా అన్నారు. రాజాజీ గారు వేరే విధంగా అంటే బాగుండేది అని కాకుండా "రాజాజీ గారూ... మీరు ఇలా అన్నారేమిటి?" అంటూ ఆయన్ని డైరెక్ట్ గా సంబోధిస్తున్నట్టుగా రాసేవారు.

అప్పట్లో ఆంధ్ర రాష్ట్రం కావాలి అని ఆంధ్రులందరూ ఆందోళన చేస్తుంటే, రాజాజీ దాన్ని విమర్శించడమూ, అలాగే దాన్ని తక్కువ చెయ్యడమూ చేస్తుండేవారు. అందుకని ధర్మారావు గారు 1940 ఫిబ్రవరి 14 న వచ్చిన "కాగడా"లో "తడాఖా" అనే పేరు మీద ఏం రాసారంటే..

"రాజాజీ! ఆ మాటలు చెప్పడానికి మీ అంతటి వాడు మరి లేడు. నీతులు చెప్పడానికి పూనుకుంటే, ఏదో ఒక ఉపాధ్యాయుడి లాగా "వచించడం మేలహో " అనే పద్యం జ్ఞ్యాపకం వస్తుంది. ముందు చూపేగానీ, మీలో వెనక చూపు కనిపించదు. లోచూపు అనే మాట అసలే లోపించింది లెండి. మొన్న 'తూత్తుకుడి'లో ఏం అన్నారో జ్ఞాపకం వుందా? "అధిక సంఖ్యాకుల అభిప్రాయాలను అనుసరించి, అల్ప సంఖ్యాకులు కొంచెం సవరించు కోవడం డెమోక్రసీ" అన్నారు. మీ కడుపులో వున్న అభిప్రాయం వేరు. ఆఖరికి మా ఆంధ్ర రాష్ట్రం సంగతి ఏమంటారు?అదంతా డెమోక్రసీయే నని మీ వియ్యంకుడు మహాత్మా గాంధీతో చెప్పిస్తారా? కాకపోతే మీరే చీపురుకట్ట పట్టుకొని తుడిచేస్తారా? దేనికైనా సమర్థులు లెండి. ఇంత మంది వున్నా గాంధీకి ఈ రోజుల్లో మీరు తలలో నాలుక లాగా వున్నారు. " అని అంత ధైర్యంగా విమర్శిస్తూ ఉండేవారు.

ఎక్కడ న్యాయం ఉంటే, ఎక్కడ ధర్మం ఉంటే అటువైపు, ఆయన శీర్షికలు ఉంటూ ఉండేవి. ఉదాహరణకు 1940 ఆగస్టు 7 న వచ్చిన "కాగడా"లో 'తడాఖా' పేరు తోటి ప్రకాశం పంతులు గారిని కూడా విమర్శించారు. ఎందుకంటే, మద్రాస్ లో పౌరులకు నీళ్ల సదుపాయం కోసమని "పూండీ రిజర్వాయర్" ని నిర్మించారు. దాని ప్రారంభోత్సవాన్ని ఆంగ్లేయుడైన గవర్నర్ ప్రారంభిస్తున్నాడు. అందుకని "ఆ సభకు ఎవరూ వెళ్ళవద్దు" అని

పురపాలక సంఘం యొక్క కాంగ్రెస్ సభ్యులకు, ప్రకాశం పంతులు గారు ఒక నోటీస్ పంపించారు. దాని మీద ధర్మారావు గారు ఏం వ్రాశారంటే,

"ప్రకాశం పంతులు గారూ! ఎప్పటి నుంచి కలిగిందండీ మీకీ ఆవేశం. మంత్రులుగా ఉండేటప్పుడు ఈ మతి ఉండేదా? రాజాజీ గారి డిన్నర్లకు వెళ్ళేటప్పుడు ఆంధ్ర కేసరి నిద్ర పోతూ వుందా? యూనియన్ జాక్ కు సలాము చేసినప్పుడు,పెద్ద మంత్రి, బాల మంత్రి, పనిలేని మంత్రి వగైరాలు హాజరు మనవి చేసినపుడు, ప్రకాశంగారు ప్రసూక్తులై కలలు గంటున్నారా? మద్రాస్ అంతా తాగడానికి నీళ్లు లేక, తహతహ లాడుతూ ఉంటే కదా ఈ స్కీమ్ వేశారు. పురజనులకు బాగా కావలసిన విషయం ఈ "పూండీ రిజర్వాయర్". మునిసిపల్ సభ్యులు మీమాట ఏమైనట్టు? మీ అధికారం బంగారం గానూ, ఇదటండీ మీరు చేసేపని"

ఇలా, చక్కటి తెలుగులో వ్యంగ్యంగా, సూటిగా, విమర్శిస్తూ ఉండేవారు. కేవలం రాజకీయ వార్తలే కాకుండా, ఆయన మొట్ట మొదట్లో చెప్పినట్టుగానే, సాహిత్య రంగంలో కూడా కాగడా చక్కటి కృషి చేసింది. ఉదాహరణకు "పద్య బిక్ష" అనే శీర్షికను పెట్టి, ఒక అంశాన్ని ఇచ్చి, దాని మీద ఎవరైనా పద్యాలు రాయండి అని అడిగి, ఆ వచ్చిన పద్యాల్లో కొన్నిటిని. ఎంపిక చేసి కాగడా లో ప్రచురిస్తుండేవారు.

1940 సెప్టెంబర్ 25 న ఒక ప్రకటన వచ్చింది.

"40 కోట్ల ప్రజల ముఖాలలో వీరతాండవం చేస్తున్న దారిద్ర్య సారం" అంతా ఒక చిన్న పద్యంలో చెప్పండి. దాన్ని మేము పద్య బిక్ష అనే శీర్షికలో వేస్తాము." అని. 1940 అక్టోబరు 9 న వచ్చిన కాగడాలో ఆ పద్య భిక్షకు వచ్చిన కొన్ని పద్యాలను ప్రచురించారు.

అడవి బాపిరాజు గారి పద్యం ఇలా సాగింది... "ప్రళయ భైరవ భైర నర్తనము సేయు, క్షుణభిత కంకాళ మాళ విశుష్క ఘోష క్షామ దేవత శతకోటి చరణ ఘాతముల ధరిత్రోతర ... నేడు

భాగవతుల శంకర శాస్త్రి (అంటే బహుశా ఆరుద్ర గారు) అయి వుంటారు. ఆయనే ఏం రాశారంటే, "కట్టు బట్టలేక కదుపుకన్నము లేక నిలువ నీడ లేక, నీరు లేక మనువు లేక, మరల మరణించలేక, బ్రతుకువాని, బ్రతుకుయగునే " ఇది 1940 అక్టోబర్ 16 వ తేదీ సంచికలో వచ్చింది.

అలాగే సముద్రాల గారు 1940 డిసెంబర్ 11 న వచ్చిన కాగడాలో ఇదే శీర్షికలో "ఆకలో ఆకలో అనుచు అదలనేలా, చివికి జీర్ణించి మిగులు గోచియును లేక దీన దేవునివలె తోచు మానవునకు చేతులర్పించి మిడుకుతు చీకటింట." ఈ కాగడా పత్రిక 2,3 సంవత్సరాలు మించి నడవలేదు. ఎందుకంటే, అప్పటికే రెండవ ప్రపంచ యుద్ధం తీవ్రతరం కావడం, ఆ సమయంలో "మద్రాస్ లో బాంబులు పడతాయి "అని చాలా మంది అక్కడ నుండి వెళ్లిపోవడం ఈ హడావుడి తోటి 1942 మధ్యలోనే కాగడా పత్రికను ఆపేశారు. ఇవి కాగడా పత్రిక విశేషాలు.

ఈ కాగడా ముందు నడిపిన జనవాణి గురించి తెలుసుకున్నాం కదా! ఆ "జనవాణి వెర్షన్ -2" సంగతి ఏమిటంటే, 1942 లో కాగడా పత్రికను ఆపేసాక, ధర్మారావు గారు సినిమాల్లో బాగా బిజీ అయిపోయారు. ఆయన సినిమాల్లో ఎంత బిజీగా వున్నప్పటికీ పాత్రికేయ వృత్తి మీద మాత్రం ఆయనకు ఆసక్తి తగ్గలేదు. ఎందుకంటే అప్పటికే 3 పత్రికలు నడిపి వున్నారు. 1949 ప్రాంతాల్లో అంటే, భారతదేశానికి స్వాతంత్రం వచ్చాక, మళ్ళా ఆయన జనవాణి పత్రికను పునరుద్ధరించారు. ఈసారి జనవాణి పత్రిక ఆయన సొంత పత్రికే. గతంలో ఆ పత్రిక పీపుల్స్ పార్టీకి అనుబంధంగా ఉండేది. అందుకని ఈ జనవాణి-2 ప్రారంభించినపుడు ,

"నాటి జనవాణి పరతంత్ర. నేటి జనవాణి స్వతంత్ర. అప్పటిలాగే , ఇప్పుడు కూడా మీకు సేవచెయ్యడమే మా దీక్ష. కాగడా పట్టుకొని కల్లా కపటమూ లేకుండా సత్యాన్ని కనపరచడమే మా పని. జంకూ, బొంకూ లేకుండా జనవాణి ని ప్రకటించడమే మా వుద్యోగం. అన్ని రంగాలలోనూ ఆంధ్రుల పురోగమనానికి పాటు పడడమే మా సూత్రం." అని ఫిబ్రవరి 29 వ తేది 1949 సంచికలో చెప్పారు తాపీ ధర్మారావు గారు. ఆ రోజుల్లో మద్రాస్ నుండి విడిపోయి ఆంధ్ర రాష్ట్రం కావాలి అనే వాదన చాలా బలంగా వినిపిస్తోంది. దానికి బలపరచడమే మా ధ్యేయం అని కూడా చెప్పారు.

ఈ జనవాణికున్న మరో ప్రత్యేకత ఏమిటంటే, అంతకు ముందు కమ్యూనిస్ట్ పత్రికలు రెండు వచ్చాయి. ప్రజాశక్తి, విశాలాంధ్ర. కానీ, కమ్యూనిస్టుల మీద నిర్బంధం వున్న కారణంగా అవి ఆగిపోయాయి. ప్రజాశక్తి, విశాలాంధ్ర లలో పనిచేసిన వాళ్ళు కూడా ఈ జనవాణిలో పనిచేయడానికి వచ్చారు. వారిలో శెట్టి ఈశ్వరావు గారూ, కొండేపూడి లక్ష్మీ నారాయణ గారూ లాంటి వాళ్ళున్నారు. అందుకని బహిరంగంగా చెప్పకపోయినప్పటికీ జనవాణి కమ్యూనిస్టులను సమర్ధించే పత్రిక అని పేరు తెచ్చుకుంది. ఎందుకంటే అప్పటికి అంటే 1949 ప్రాంతాల్లో కమ్యూనిస్టులకు విడిగా పత్రిక లేదు కాబట్టి. ఇప్పటి జనవాణి లో కూడా అయన రకరకాల శీర్షికలు నిర్వహిస్తూ ఉండేవారు. అంతకు ముందు అయన పనిచేసిన పత్రికల్లో కూడా శీర్షికలు ఉండేవి కదా! అలాగే ఇందులో కూడా ఒక 20 శీర్షికలు పెట్టుకొని ప్రతి సంచిక లోనూ ఒక 5,6 శీర్షికలు ప్రచురిస్తుండేవాళ్ళు. వాటిల్లో రాజకీయాలే కాక వివిధ అంశాలు ఉండేవి.

కర్ణ పిశాచం, వెర్రి వెధవ, పేలుదు గాయలు... ఇలాంటి శీర్షికలతోటి వివిధ అంశాలు అందిస్తుండేవారు. జనవాణి ని నడపడంలో కూడా ఆయన ఎంత ధైర్యంగా ఉండేవాడు ఒక ఉదాహరణ, 1949 లో చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రి గారికి, ఆస్థాన విద్వాంసుడు అన్న పదవిని కల్పించారు. "అసలు ఆయనకు ఆస్థాన విద్వాంసుడు అనే పదవి ఎందుకివ్వాలి?" అని "సందేహి" అన్న పేరు తోటి రాశారు. "దేశ స్వాతంత్ర పోరాటంలో ఈయన చేసినదేమిటి?ఈయన రచనల్లో స్వాతంత్ర పిపాస ఉందా?దర్బారులే లేని ఈనాడు ఆ రాజులకు చిహ్నంగా ఈ

నియామకం ఎందుకు?" ఇలా దాని మీద వాద, ప్రతి వాదాలు  కొంత కాలం కొనసాగడం జరిగింది. ఏం చేసినా గానీ, ఆంధ్ర రాష్ట్ర సమస్యను ఏదో రూపంలో ప్రస్తావిస్తూ ఆంధ్ర రాష్ట్రం కోసం ఉద్యమం చెయ్యాలి అని పదే పదే నొక్కి వక్కాణిస్తుండేవారు తాపీ ధర్మారావు గారు.

ఈ సంవత్సరాల్లోనే అంటే, 1949-52 మధ్యలో చాలా మంది ప్రముఖులు గతించారు. ఉదాహరణకు సరోజినీ నాయుడు గారు 49 లో, కొండా వెంకటప్పయ్య గారూ, వేటూరి ప్రభాకర శాస్త్రి గారూ, సర్దార్ పటేల్ గారూ, అలాగే అడవి బాపిరాజు గారూ, పొట్టి శ్రీరాములు గారూ వీళ్ళందరూ మరణించి నపుడు మనసుకి హత్తుకుని కదిలించే సంపాదకీయాలు రాస్తూండేవారు. ఇంకొక ప్రయోగం ఏమిటంటే, జనవాణిలో నాటక రంగానికి ప్రత్యేకమైన కృషి చేసింది. ఆచార్య ఆత్రేయ గారు రాసిన "ప్రగతి, ఎవరు దొంగ, ఓటు నీకే, అంతర్యుద్ధం, విశ్వశాంతి" ఇలాంటి నాటికలన్ని కూడా జనవాణి లో ప్రచురించారు.

ఇలా 2,3 సంవత్సరాలు నడిచింది. కానీ, ఆర్ధిక పరమైన ఇబ్బందులు రావడం, ప్రెస్ లో ఇబ్బందులు రావడం, ఆయన సినిమాల్లో బిజీగా ఉండడం – ఈ పరిణామాలన్నీ చోటుచేసుకున్నాయి. కొంతకాలం వారబ్బాయి చాణక్య గారు నడుపుతూ ఉండేవారు. ఇన్ని ఇబ్బందులు వచ్చిన పళ్ళ బిగువు మీద 1953 ఏప్రిల్ వరకు నడిపి ఆ తరువాత ఆపేశారు. జనవాణి మూగబోయింది. తాపీ ధర్మారావు గారు కూడా సినిమాల్లో బిజీ అయిపోయారు. కానీ, ఆ తరువాత పత్రికలు నడిపినటువంటి దాఖలాలు కనిపించలేదు.

ఇవండీ సమదర్శినీ, ప్రజామిత్ర, జనవాణి, కాగడా పత్రికల విశేషాలు. ఇవి రాజకీయ పార్టీలు నడిపే పత్రికలు అయినప్పటికీ, వాటిని నడిపేవారు సాహిత్యంలో ఆరితేరిన వారు కాబట్టి, సాహిత్య సంబంధమైన అంశాలకు కూడా పెద్దపీట వేశారు.

తరువాత మనం విశేషాలు తెలుసుకోబోయే పత్రిక దినపత్రిక"ఆంధ్ర ప్రభ". 1938 ప్రాంతాల్లో ఆంధ్రదేశంలోని దిన పత్రికల పరిస్థితిని గమనిస్తే, స్థానికంగా వచ్చే చిన్నా, చితకా పత్రికలు ఏమైనా ఉంటే వాటిని మినహాయించి తెలుగు పాఠకులకు జాతీయ, రాష్ట్ర వార్తలను అందిస్తున్నది "ఆంధ్రపత్రిక" దిన పత్రిక ఒక్కటే. అప్పటి వరకూ చూసుకుంటే, తెలుగు పత్రికలన్నీ కూడా తెలుగు వారు ప్రారంభించినవే. బహుశా తెలుగు వాడు కాని వ్యాపారవేత్త ప్రారంభించిన తొలి దినపత్రిక "ఆంధ్రప్రభ". దీన్ని ప్రారంభించింది రామ్ నాథ్ గోయంకా. ఆయన ఆంధ్ర ప్రభ దినపత్రిక ప్రారంభించే సమయానికి "ఇండియన్ ఎక్స్ ప్రెస్ "అనే ఆంగ్ల దిన పత్రికకూ, "దిన మణి "అనే తమిళ దినపత్రికకూ యజమాని.

నిజానికి ఆ రెండు దినపత్రికలు కూడా రామ్ నాథ్ గోయంకా స్థాపించినవి కాదు. 1932 లో మద్రాస్ లో "వరదరాజులు నాయుడు "అనే ఆయుర్వేద డాక్టర్ ఉండేవాడు. ఆయనకు "తమిళ నాడు ప్రెస్"అనే పేరుతో ఒక ప్రెస్

ఉండేది. దాని తరపున ఇండియన్ ఎక్స్ ప్రెస్ అనే దినపత్రికను 1932 లో ప్రారంభించారు. కాకపోతే వ్యాపారంలో మెళకువలు ఎక్కువగా తెలియకపోవడం వలన ఒక సంవత్సరం లోపే, ఆ ఇండియన్ ఎక్స్ ప్రెస్ పత్రికను స్వామి నాథన్ సదానందన్ అనే ఆయనకు అమ్మేశాడు. ఈ అమ్మకం, కొనుగోలు వ్యవహారంలో స్వామినాథన్ కు ఆర్థిక సహాయం చేసినవాడు రామ్ నాథ్ గోయంకా.

ఆ స్వామినాథన్ ఇండియన్ ఎక్స్ ప్రెస్ ను కొన్న తరవాత, రెండవ ఆఫీసును మధురైలో కూడా మొదలుపెట్టి, “దిన మణి “అనే తమిళ దినపత్రికను కూడా ప్రారంభించాడు. ఆయన కూడా వ్యాపారంలో ముందుకు వెళ్లలేక, రెండేళ్లు కూడా దాటకుండానే ఆ రెండు పత్రికలనూ కూడా రామ్ నాథ్ గోయంకాకు అమ్మేశాడు. అలా 1935 లో గోయంకా ఇండియన్ ఎక్స్ ప్రెస్ కీ, దినమణికీ యజమాని అయ్యాడు. అప్పట్లో ఇండియన్ ఎక్స్ ప్రెస్ సర్క్యులేషన్ రెండు వేలు మించి ఉండేది కాదు. వ్యాపార విస్తరణలో భాగంగా తెలుగులో ఒకటే దినపత్రిక వుంది కాబట్టి, ఆ మార్కెట్ బాగుంటుందని 1938 లో “ఆంధ్రప్రభ “దినపత్రికకు శ్రీకారం చుట్టారు గోయంకా.

కొత్త పత్రికకు పేరు సూచించమని పాఠకుల్నే అడిగారు. వాళ్ళు పంపించిన వాటిలో నుంచి “ఆంధ్రప్రభ” అనే పేరుని ఎంపిక చేసుకున్నారు. అది సూచించిన బళ్లారి వాస్తవ్యుడికి ఆరోజుల్లోనే 116 రూపాయలు బహుమతి కూడా పంపించారు ఇండియన్ ఎక్స్ ప్రెస్ వాళ్ళు. మొట్టమొదటి ఆంధ్ర ప్రభ సంచిక 1938 ఆగస్టు 15 న వచ్చింది. ఆంధ్ర ప్రభ ఆగస్టు 15న ప్రారంభం కావడం సరిగ్గా, 9 ఏళ్ళ తర్వాత భారత దేశానికీ స్వాతంత్రం రావడం చాలా యాదృచ్ఛికం. దానికి తొలి ఎడిటర్ “కాసా సుబ్బారావుగారు “. అయన నెల్లూరి జిల్లాకు చెందిన వాడు.

కాసా సుబ్బారావుగారు అప్పటికే అంటే, ఆంధ్రప్రభకు వచ్చేనాటికి పత్రికా రంగంలో విశేషమైన అనుభవంతో, ఇండియన్ ఎక్స్ ప్రెస్ లో ఎడిటర్ గా పనిచేస్తున్నారు. బహుశా ఆయన తెలుగువాడు కాబట్టి, ఆయన సంస్థలోనే చాలా కాలం పనిచేస్తున్నాడు కాబట్టి, ఈ ఆంధ్ర ప్రభ తెలుగు ఎడిషన్ కి ఎడిటర్ గా ఎన్నుకొని వుంటారు గోయంకా. అప్పట్లో వార్తా పత్రికల్లో ఒకరి పట్ల ఒకరికి పరస్పర గౌరవం ఎలా ఉండేది అనడానికి ఒక ఉదాహరణ ఆ మరుచటి రోజు 1938 ఆగస్టు 16 వ తేదీన ఆంధ్రపత్రిక దినపత్రిక సంపాదకీయంలో “కొత్తగా ఆంధ్రప్రభ వస్తోంది. దానికి స్వాగతం.” అంటూ ఇలా రాశారు.

“ఆంధ్రప్రభకు స్వాగతము. ఇంగ్లీష్ లో వెలువడుతున్న ఇండియన్ ఎక్స్ ప్రెస్ జాయింట్ ఎడిటర్ కాసా సుబ్బారావు గారే ఈ పత్రికకునూ సంపాదకులు. నిన్నటి ప్రథమ సంచికలో ఆంధ్ర, ఆంధ్రేతర నాయకులు పంపిన సందేశములు ప్రకటింపబడినవి. ఒకరు భాషను గూర్చియూ, ఒకరు భావమును గూర్చియూ, పత్రికను నడపవలసిన పద్ధతులు గూర్చియూ సందేశము లొసంగుచూ, స్వస్తి వాచకములు బల్కిరి. పత్రికా సంపాదకులనూ తొలి పలుకులలో తమ ఆశయములు వివరించిరి. విశాలాంధ్ర దేశములో ఎన్ని దినపత్రికలకైనా , ముఖ్యంగా జాతీయ

పత్రికలకు సావకాశము ఏర్పడినది అని చెప్పుచూ, ప్రపంచ, భారత రాజకీయ క్లిష్ట పరిస్థితులలో ముఖ్యంగా ఆగస్టులో జన్మించి ఆంధ్ర రాష్ట్రం కోసం ఆందోళన సాగించుతుందని తొలిపలుకు. ఈ పలుకు సార్ధకమగు గాక"

తమకు పోటీగా వస్తుంది ఆంధ్రప్రభ అని అనుకోకుండా దానికి స్వాగతం ఇస్తూ ఆంధ్రపత్రిక వాళ్ళు ఆత్మీయంగా వ్రాసిన ఎడిటోరియల్ అది. అలాంటి విలువలు ఈ రోజుల్లో కూడా చూడగలిగితే ఎంత బాగుంటుంది! అనిపిస్తుంది. కాసా సుబ్బారావుగారు ఆంధ్రప్రభ సంపాదకుడిగా రాసిన సంపాదకీయాలు ఆనాటి స్వాతంత్రోద్యమ నాయకుల్నే కాకుండా, గాంధీజీని కూడా బాగా ఆకర్షించాయట. మొదటి నుంచే కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలనూ, ఆశయాలనూ సమర్ధిస్తూ కొనసాగింది ఆంధ్రప్రభ దినపత్రిక.

అప్పటికే వివిధ పత్రికల్లో రిపోర్టరుగా, ఫ్రీలాన్సర్ గా , ఉప సంపాదకుడిగా పని చేస్తున్న "నార్ల వెంకటేశ్వరావు గారు ఆంధ్ర ప్రభలో న్యూస్ ఎడిటర్ గా చేరారు. కాసా సుబ్బారావు గారి తర్వాత న్యాపతి నారాయణ మూర్తి అనే ఆయన కొద్ది కాలం పాటు ఆంధ్రప్రభ దినపత్రికకు సంపాదకుడిగా చేశారు. ఆయన తర్వాత 1942 లో అప్పటికి 4 ఏళ్లుగా న్యూస్ ఎడిటర్ గా వున్న నార్ల వెంకటేశ్వరావుగారు సంపాదకుడిగా ప్రమోట్ అయ్యారు. నార్లవారు సంపాదక బాధ్యతలు తీసుకునేటప్పటికి పత్రిక సర్క్యులేషన్ 2,700 కాపీలు మాత్రమే.

ఆయన ఆంధ్రప్రభలో 17 సంవత్సరాలు పనిచేసి, 1959 లో ఆ సంస్థను వదిలేసేసరికి ఆంధ్రప్రభ సర్క్యులేషన్ 60 వేలకు వెళ్ళింది. నార్లవారు ఆంధ్రప్రభలో వున్న ఆ 17 సంవత్సరాలూ తెలుగు వార్తా పత్రికా యుగానికి స్వర్ణ యుగం అంటారు. ప్రధాన వార్తలకు శీర్షికలు నిర్ణయించడం దగ్గరనుండి పేజీ మేకప్, వార్తలను అందించే భాష, ఇలా ఆంధ్రప్రభలో గణనీయమైన మార్పులకు కారణం నార్ల వెంకటేశ్వరావు గారు. ఆ రోజుల్లో నార్ల వారు రాసిన సంపాదకీయాలు గొప్ప సంచలనాలు. ఉదాహరణకు ఆయన కలం బలం ద్వారా ప్రజా సమస్యలకు ఉద్యమరూపం తీసుకురావడంలో ప్రధాన పాత్ర పోషించారు. ఆయన సంపాదకత్వం తీసుకున్న కొత్తలోనే "క్విట్ ఇండియా" ఉద్యమం మొదలయ్యింది. ఆ సందర్భంలో బ్రిటీష్ ప్రభుత్వం ప్రెస్ సెన్సారింగ్ తీసుకువచ్చినందుకు నిరసనగా ఆంధ్రప్రభను కొన్ని నెలల పాటు మూసేశారు.

మళ్ళీ ప్రారంభం అయ్యాక కూడా మైసూరు రాజ్యం లోనూ, నిజాం రాజ్యంలోనూ కూడా నిషేధానికి గురయ్యింది ఆంధ్రప్రభ. 1946 లో వుమ్మడి మద్రాస్ రాష్ట్రానికి జరిగిన ఎన్నికల్లో ప్రజాభిప్రాయాన్ని కాదు అని గాంధీజీ, రాజగోపాలాచారిని ముఖ్యమంత్రిని చెయ్యాలని చూశారు. నార్లవారు ఆంధ్రప్రభ ద్వారా చేసిన ఉద్యమ ఫలితంగా రాజాజీ కాకుండా ప్రకాశం పంతులుగారే ముఖ్యమంత్రి అయ్యారు. మళ్ళీ కొన్నాళ్ళకి ప్రకాశం పంతులుగారి ప్రభుత్వ తీరు పట్ల అసంతృప్తిని ప్రకటిస్తూ ఆంధ్ర ప్రభలో నార్ల వారు తన పత్రికలో 5

సంపాదకీయాలు రాశారు. వాటి కారణంగా ప్రకాశం పంతులు గారి ప్రభుత్వం కూలిపోవడానికి కూడా కారణం అయ్యారు. అంత నిబద్ధతతోటి, నిజాయతీ తోటి ఆంధ్ర ప్రభను నడిపారు నార్ల వెంకటేశ్వరావు గారు.

ఆయనట ఎప్పుడూ రాజీనామా లేఖను జేబులో ఉంచుకొని తీరుతుండేవారట. తుఫానులూ, కరువులూ ఇలాంటివి వచ్చినపుడు కూడా పత్రిక ద్వారా విరాళాలు సేకరించి అవసరమైన వాళ్లకు అందించడంలో ప్రముఖ పాత్ర వహించారు నార్ల. 1959 లో ఓ సారి, ఇండియన్ ఎక్స్ ప్రెస్ గ్రూపులో కార్మికుల సమ్మె జరిగింది. సహజంగానే రామ్నాధ్ గోయంకా గారికి అది ఇష్టం లేదు. గోయంకా గారి యాజమాన్య విధానాలకు వ్యతిరేకంగా కార్మికుల పక్షాన నిలబడడంతో సంపాదకత్వ బాధ్యతల నుండి నార్ల వారు తప్పుకోవాల్సి వచ్చింది.

ఆయన తర్వాత నీలం రాజు వెంకట శేషయ్య గారు ఆంధ్రప్రభకు సంపాదకులు అయ్యారు. ఆ తర్వాత రోజుల్లో పండితారాధ్యుల నాగేశ్వరావు గారూ, విద్వాన్ విశ్వం గారూ, కూచిమంచి సత్య సుబ్రహ్మణ్యం గారూ, పొత్తూరి వెంకటేశ్వరావు గారూ మొదలయిన ప్రముఖులు ఆంధ్రప్రభ దినపత్రికకు ఎడిటర్స్ గా పనిచేశారు. ఇంక ప్రధాన ఎడిటర్లు కాకపోయినా వివిధ సందర్భాలలో శ్రీశ్రీ గారూ, గొల్లపూడి మారుతీరావు గారూ లాంటి వారుకూడా ఆంధ్రప్రభ సంపాదక వర్గంలో పనిచేశారు. 1974 లో ఈనాడు రంగ ప్రవేశం చేసే సమయానికి ఆంధ్రప్రభ దినపత్రిక అత్యధిక సర్క్యులేషన్ తో ఉండేది.

రామ్ నాధ్ గోయంకా చనిపోయాక ఆ ఇండియన్ ఎక్స్ప్రెస్ యాజమాన్యం రెండు భాగాలుగా చీలిపోయి, ఆంధ్ర ప్రభకు రామ్ నాధ్ గోయంకా మనవడు మనోజ్ సంతాలియా యజమాని అయ్యాడు. 1980 తర్వాత వార్తా పత్రికల రూప కల్పనలో వచ్చిన ఆధునిక సాంకేతికను అంది పుచ్చుకోవడంలో కాస్త నెమ్మదించింది ఆంధ్రప్రభ అని చెప్పుకోక తప్పదు. చివరికి 2005లో ఆంధ్రప్రభ దినపత్రికను కాకినాడకు చెందిన వ్యాపార వేత్త ముత్తా గోపాల కృష్ణ గారికి అమ్మేశారు. ఆయన ఆధ్వర్యంలోకి వచ్చాక పి.విజయబాబుగారు ఆంధ్రప్రభ దినపత్రికకు సంపాదకుడిగా పనిచేశారు. యాజమాన్య మార్పిడి తోటి 82 సంవత్సరాలుగా నడుస్తున్న ఏకైక దినపత్రిక ఆంధ్రప్రభ అని చెప్పుకోవచ్చు. ఈ ఆంధ్రప్రభకు అప్పటినుండి చూసుకుంటే, దేశ , రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఖచ్చితంగా తనదైన స్థానాన్ని నిలబెట్టుకుంటూ వచ్చింది. ఇవండీ ఆంధ్రప్రభ దినపత్రిక చరిత్ర గురించిన సమాచారం.

ఇంక – ఆంధ్రప్రభ దినపత్రిక నడుస్తున్న రోజుల్లో జరిగిన చారిత్రక సంఘటనల గురించి ఆ పత్రికలో వచ్చిన వార్తల కవరేజ్ ఎలా ఉండేదో చూద్దాం. 1947 ఆగస్టు 15 న భారతదేశానికి స్వాతంత్రం వచ్చింది కదా! దానికి దాదాపు 10 రోజుల ముందు నుంచి ఆంధ్ర ప్రభ దినపత్రిక లో నార్ల వెంకటేశ్వరావు గారు "స్వాతంత్ర భానోదయ వేళ "అనే శీర్షికతో సంపాదకీయాలు రాశారు. "స్వాతంత్ర భానోదయ వేళ –1,2 3.... ఇలా సంఖ్యలు వేసుకుంటూ మొత్తం 10 రోజులు ముందు నుంచే ఆయన సంపాదకీయాలు రాసారు. ఆయన ఏం రాసారో తెలుసుకుంటే

ఇప్పటికి కూడా ఆయన రాసిన సంపాదకీయాలు ఎంత విలువ వుందో తెలుస్తుంది., ఉదా:1947 ఆగస్టు 13 న రాసిన సంపాదకీయం లో ఇలా చెప్పారు.

"ఆత్మవిశ్వాసం లేనివాడు స్వతంత్రుడై నప్పటికీ బానిసతో సమానమే. ఆత్మవిశ్వాసం, అహంకారంగా పరిణమించగల ప్రమాదం లేకపోలేదు. నిజానికి, ఈ ఆత్మవిశ్వాసానికి, అహంకారానికి భేదం ఏమిటంటే, తరతమాల్లోనే. ఆత్మవిశ్వాసాన్ని, దానితో పాటుగా ఆత్మ గౌరవాన్ని కోల్పోయినందున మన జాతి బానిసత్వానికి పాల్పడవలసి వచ్చినది." అని చెబుతూ.. హనుమంతుడి యొక్క ఉదాహరణ కూడా ఇచ్చారు. హనుమంతుడికి చాలా శక్తి వుంది. కానీ, ఆయనకు ఆత్మవిశ్వాసం లేదు. ఎవరో ఒకరు గుర్తు చేస్తే తప్ప గుర్తురాదు. భారతజాతి కూడా అలాంటిదే. మనకు ఎవరైనా గుర్తు చేసేవరకూ మన బలం తెలియలేదు. ఇప్పటికైనా గాని మన బలం తెలుసుకున్నాం. కొద్దీ రోజుల్లో స్వతంత్రం వస్తుంది."

1947 ఆగస్టు 14 వ తేదీన ఏం రాసారంటే – ఒక వైపు భారతదేశానికి స్వాతంత్రం వస్తుంది అని స్థిరమైపోయింది. అక్కడ నిజాం ప్రభుత్వం సర్వ స్వాతంత్ర ప్రకటనకై నిజాం ప్రభుత్వం కృత నిశ్చయం. "మేము స్వంతంగా మా రాజ్యమును మేమే వుంచుకుంటాము. మీలో కలవము." అని నిజాం ప్రభుత్వం చెప్పిందని ఆగస్టు 14 వ తేదీ ఆంధ్ర ప్రభ మెయిన్ హెడ్డింగ్. అలాగని చెప్పి, మౌంట్ బాటెన్ కు నిజాం సంస్థానాధిపతి వుత్తరం రాశాడు. అది ముఖ్య వార్తగా వచ్చింది.

అదే రోజు క్రిందన ... మతోన్మాద నివారణకై మహాత్ముని కఠోర నిర్ణయం అని కూడా ఒక వార్త వచ్చింది. 1947 ఆగస్టు 14 న.

భారతదేశానికి స్వాతంత్ర్యం రావడానికి ఒక రోజు ముందు నార్ల వారు రాసినటువంటి ఎడిటోరియల్.

"మరి ఒక పగలూ, ఒక రాత్రీ జరిగితే చాలు. కేవలం 24 గంటలు గడిస్తే చాలు. స్వాతంత్ర్య భానోదయం జరుగుతుంది. దాదాపు రెండు శతాబ్దాల పాటు గాఢాంధకారంలో గడిపిన పిమ్మట,మరి 24 గంటల లోపట, స్వాతంత్ర కాంతి పుంజాలను చూడగలం అని విశ్వసించడం కష్టమైన పనే. అయినా, చీకటి నుంచి వెలుగులోకి మనం అడుగు పెడుతున్నాం అన్నమాట. చీకటికి అలవాటు పడిన కళ్ళకు వెలుగును చూడడం ఆదిలో కష్టమే కావచ్చు. కానీ, బానిసత్వపు చీకటి దాదాపు ఒక శతాబ్దం నుంచి మనకు బాధాకరమైనందున గత అర్ధ శతాబ్దంలో అనుక్షణం దుస్సహనమైనదిగా పరిణమించినందున, స్వాతంత్ర భానోదయం మనకు మహా పర్వం కాగలదు అన్నది నిస్సందేహం. "

అని చెబుతూ చిట్టచివరిలో ఏం రాశారంటే ... "ఇది వరలోవలె ఇక ముందు కూడా భారతీయ ప్రభుత్వోద్యోగులు అసమర్ధతకూ, అవినీతికీ, నిరంకుశత్వానికీ, ప్రపంచ ప్రఖ్యాతినంద గలవారైతే, అది మనకే

కళంకం. ఈ విషయాన్ని పూర్తిగా గుర్తించి, అందుకు అనుగుణంగా మనం వర్తిస్తేనే, మన దేశ పరిపాలన సరిగా సాగడం అయినా, మన దేశ స్వాతంత్రత సార్ధకం కావడం అయినా"

అంటే.. "ఇంతకు ముందు వరకూ కూడా భారతీయ ప్రభుత్వోద్యోగులు అసమర్ధతకూ, అవినీతికీ, నిరంకుశత్వానికీ వాళ్ళు ప్రతిబింబాల్లాగా ఉండేవారు. ఇక ముందైనా వాళ్ళు అలా లేకుండా ఉంటే, మన దేశం బాగుపడుతుంది." అని అన్నారు. మనం జాగ్రత్తగా అన్వయించి చూసుకుంటే, ఈ విషయాలు ఇప్పటికి కూడా వర్తిస్తాయి.

ఇంకా స్వాతంత్రం వచ్చిన రోజు 1947 ఆగస్టు 15 ఆంధ్ర ప్రభ మెయిన్ హెడ్డింగ్ ఏమిటంటే..

"స్వతంత్ర భారతజాతికి స్వతంత్ర భారతనాయకుల శంఖారావం"

ఇది భారతదేశ చరిత్రలోనే కాక, ప్రపంచ చరిత్రలో మహా సుదినం – పండిట్ జవహర్ లాల్ నెహ్రూ

"దేశ విభజనకు మనం చింతించనవసరం లేదు." అని రాష్ట్రపతి కృపలానీ అన్నారు. పక్కన రాసారు.

ప్రపంచ ప్రముఖుల నీరాజనం.

"మీ భవిషత్తు ఉజ్వలం." అని చాంగ్ కై షేక్ అభినందన అందించారు.

అలాగే నార్ల వారు రాసిన సంపాదకీయం. అంటే అంతకుముందు వరకూ స్వాతంత్ర భానోదయం అనే శీర్షికతో రాస్తూ వచ్చారు కదా! దానికి పరాకాష్ట గా ఆగస్టు 15 న ఏం రాశారంటే...

"దాస్యాంధకారం తొలగింది. స్వాతంత్ర భానోదయం జరిగింది. శృంఖలాలు తొలగిపోయినవి. తిరిగి స్వతంత్ర ప్రజలమైనాము. ఘోర జాతీయ కళంకం తొలగింది. ఇక మనం దివ్య ప్రభలతో వెలుగొందవచ్చు.పంజరం తలుపు తెరచుకున్నది. ఇక దివ్యాంబర పదాలలో ఎగసిపోయి, స్వేచ్చా విహారం చెయ్యకపోతే, ఆ తప్పు మనదే. ఎంత శుభదినం ఇది. ఎంత సంతోషదినం ఇది. ఎంత పుణ్యదినం ఇది. ఎంతటి పర్వదినం ఇది. ఎంతటి చారిత్రకదినం ఇది. మనదేశ చరిత్రలోనే కాదు, ప్రపంచ చరిత్రలోనే ఇది చారిత్రక దినం"

"మనకి స్వాతంత్రం వస్తోంది అని మనల్ని మనం అభినదించుకోవడం, గొప్పగా చెప్పుకోవడమే కాకుండా, జాగ్రత్తగా ఉండాలి. ఇంత వరకూ భారతీయ ఉద్యోగుల్లో ఉన్నటు వంటి అవినీతి ఇలాంటివి కొనసాగకుండా ఉండాలి. రాజకీయనాయకుల్లో కూడా ఆ త్యాగం, ఆ నిరతి కొనసాగితేనే మన దేశం బాగుపడుతుంది." అని చాలా ముందు చూపుతో రాసారు నార్ల వెంకటేశ్వరరావు గారు.

ఆ తరవాత మరికొన్ని ముఖ్యమైనట ఘట్టాలను చూస్తే, 1953లో ఆంధ్ర రాష్ట్ర అవతరణ ఏర్పడినప్పుడు, "కర్నూలులో ఆంధ్ర రాష్ట్రావతరణ మహోత్సవ చిత్రావళి"అని 1953 అక్టోబర్ 3 వ తారీఖున ఆంధ్రప్రభలో చిత్రాలను పూర్తి పేజీలో ప్రచురించారు. మొట్టమొదటి ఆంధ్రరాష్ట్రానికి ముఖ్య మంత్రి ప్రకాశం పంతులు గారు

ప్రమాణస్వీకారం చేయడం చిత్రాన్ని ప్రచురించారు. అలాగే జవహర్ లాల్ నెహ్రూ వచ్చినపుడు ఆయన్ని రైల్వే స్టేషన్ నుండి తీసుకురావడం, ఇలాంటి వన్నీ, కూడా ఆ రోజు వచ్చాయి.

ఆ తరువాత 1956 నవంబర్ 1న "ఆంధ్ర ప్రదేశ్ అవతరణ" జరిగింది కదా! 1956 నవంబర్ 3 వ తేదీన ఆంధ్ర ప్రభ లో మెయిన్ హెడ్డింగ్

"ఆంధ్ర ప్రదేశ్ అవతరణ మహోత్సవం"

పాత వ్యవస్థకు స్వస్తి చెప్పి, కొత్త వ్యవస్థకు నాంది పలికే అతి ప్రధాన సంఘటన. 12 మంది సభ్యులతో ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గం ప్రమాణ స్వీకారం. అప్పుడు కూడా నార్ల వెంకటేశ్వరావు గారే ఎడిటర్ గా వున్నారు. హై కోర్టు జడ్జీల ప్రమాణ స్వీకారం కూడా. ఇవి మొట్ట మొదటి పేజీలో రాశారు.

తరువాత మైలు రాయి 1975లో జూన్ లో అత్యవసర పరిస్థితి వచ్చింది కదా! 1975 జూన్ 27న వచ్చిన ఆంధ్ర ప్రభ. అప్పటికి ఎడిటర్ పండితారాధ్యుల నాగేశ్వరావు గారు. దాని మెయిన్ హెడ్డింగ్

"దేశం అంతటా అత్యవసర పరిస్థితి"

ఆంతరంగిక కల్లోల నివారణకు రాష్ట్రపతి అసాధారణ చర్య. రాష్ట్రపతి ఫక్రుద్దీన్ నేడు దేశంలో జాతీయ అత్యయిక పరిస్థితిని ప్రకటించారు. ఢిల్లీలో కొన్ని వార్తా పత్రికలు వెలువడని పరిస్థితి. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన కారణంగా. (ఎందుకంటే ఎమర్జెన్సీ విధించగానే వెంటనే ఢిల్లీలో అన్ని వార్తా పత్రికలకు కూడా కరెంట్ కట్ చేశారు.) ఆ విషయాలన్ని కూడా మొట్ట మొదటి పేజీలో ప్రకటించారు ఆంధ్ర ప్రభలో.

మిగతా పత్రికల్లాగానే ఈ అత్యవసర పరిస్థితికి నిరసనగా ఎడిటోరియల్ ఏమీ వ్రాయకుండా ఒక తెల్లని ప్రదేశాన్ని వదిలేశారు ఆంధ్రప్రభలో. అదే రోజు ఆంధ్రపత్రిక కూడా అదే పని చేసింది.

తరవాత ఘట్టం చెప్పుకోవాలంటే.. 1977 నవంబర్ 19 న దివి తాలూకాలో వచ్చిన మహా ప్రళయం. ఆ తుఫాను గురించి ప్రతిరోజూ ఆంధ్రప్రభలో ఏం రాసారో చూద్దాం.

1977 నవంబర్ 20 వ తారీఖున ఇలా రాసారు. పెక్కు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం.
"ఆంధ్ర కోస్తా జిల్లాల్లో తుఫాను భీభత్సం. 200 కోట్ల మేరకు పంటల నష్టం."

ఆ తరువాత ఈ అంచనాలు మారుతూ వచ్చాయి. అప్పటికి ఆంధ్రప్రభ ఎడిటర్ గా కూచిమంచి సత్య సుబ్రహ్మణ్యం గారు వున్నారు. ఆ మరుచటి రోజు అంటే 21 వ తారీఖున ఆ తుఫాను తీవ్రతరం గురించి ప్రజలకు మరింత వివరంగా తెలిసింది. "తుఫాను భీభత్సంలో 241 మంది మృతి" కోస్తా జిల్లాల్లో లక్షలాది ప్రజలకు నిరాశ్రయం. ఆ తరవాత నవంబర్ 22 వ తేదీన తుఫాను యొక్క తీవ్రత పూర్తిగా తెలిసింది.

"తుఫానుకు 10 వేల మందికి పైగా బలి "

దివి తాలుకా 10 గ్రామాలు కడలి పాలు. లక్షల, కోట్ల నష్టం. ఇదంతా కూడా మూడు రోజుల తర్వాత గానీ తెలియ లేదు. ఆ మూడు రోజులు చాలా సవివరమైన చిత్రాలు ప్రదర్శించడం, ఇతర వివరాలు ప్రకటించడం చేసింది ఆంధ్ర ప్రభ. ఇవన్ని ఆంధ్రప్రభ చరిత్రలో కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఆ పత్రిక ఇప్పటికీ కొనసాగుతూ వున్నది. యాజమాన్యం మారినాగానీ.

ఈ ఆంధ్రప్రభ దినపత్రికకు అనుబంధంగా 1952లో ఆంధ్రప్రభ వారపత్రిక మొదలయ్యింది. అది 2002 వరకూ 50 సంవత్సరాల పాటు నడిచింది. దాని విశేషాలు తరవాత తెలుసుకుందాం.

అక్షరీకరణ – వి. వెంకటరావు

2020 సెప్టెంబర్ 9 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

COMMENTS